సర్వే చేయరాదు.. పాలన చేతగాదు!

- కులగణనపై వైఫల్యాన్ని ఒప్పుకున్న భట్టి
- రేవంత్ సర్కార్ ఏది చేసినా తిరోగమనమే
- ఇది లీకులు, సాకులు, ఫేకుల ప్రభుత్వం
- బీఆర్ఎస్ అసెంబ్లీ విప్ కేపీ వివేకానంద ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వేను సక్రమంగా చేయడం చేతకాని ప్రభుత్వం.. మంచి పాలన ఎలా అందిస్తుంది? అని బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ కేపీ వివేకానంద గౌడ్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఏది చేసినా తిరోగమనమేనని, అన్నింటా అభాసుపాలు అవుతున్నదని విమర్శించారు. రెండు నెలలపాటు రూ.200 కోట్లు వెచ్చించి చేపట్టిన సర్వేతో రెండు కోట్ల మంది బలహీనవర్గాల ప్రజలను అవమానించారని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కులగణనపై తమ వైఫల్యాన్ని ఒప్పుకున్నారని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో అనేక సంస్థలు, ప్రభుత్వాలు సర్వే చేశాయని, ఇంత ఘోరంగా ఎక్కడా, ఎవరూ విఫలం కాలేదని తెలిపారు. కూడికలు తీసివేతలతో కులాల జనాభాను కుట్రపూరితంగా తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న రీసర్వే డిమాండ్ వేరు.. ఇపుడు ప్రభుత్వం చెప్తున్నది వేరని పేర్కొన్నారు. ఏదో మళ్లీ నాలుగు పేజీలు సర్వేలో జోడించి మమ అనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తొలి నుంచి తప్పులను ఎత్తిచూపే ప్రయత్నం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు, సవరించుకోనూలేదు.. అని మండిపడ్డారు. డెడికేటేడ్ కమిషన్‌ను నిపుణులతో ఏర్పాటుచేసి రీసర్వే చేయాలని, అప్పుడే చట్టబద్ధత వస్తుందని చెప్పారు. ఆ కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించి రీసర్వే చేస్తేనే న్యాయస్థానాల్లో నిలబడుతుందని తెలిపారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అసెంబ్లీ ఒక్కరోజు సమావేశాన్ని ఏర్పాటుచేశారని విమర్శించారు. ఆ రోజు బీసీ రిజర్వేషన్లపై చట్టం చేస్తారనుకుంటే చేయలేదని, ఇపుడు చట్టబద్ధత గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ చావు దెబ్బ తప్పదని సర్వే రిపోర్టులు వచ్చాకే, ఎన్నికల వాయిదా కోసం రీసర్వే చేస్తామని చెప్పారని వివేకానంద తెలిపారు.

కావాలనే నాపై దుష్ప్రచారం

- ఫామ్‌హౌస్ ఘటనతో నాకు సంబంధం లేదు
- దుష్ప్రచారం చేస్తున్నవారిపై లీగల్‌గా చర్యలు
- ఎమ్మెల్సీ పోచంపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): కావాలనే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటనతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టంచేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారికి లీగల్ నోటీసులు పంపిస్తానని హెచ్చరించారు. మొయినాబాద్ మండలం, తోల్కట్టలోని తన భూమిలో బుధవారం ఎవరో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో జరుగుతున్న దుష్ప్రచారంపై గురువారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. 'నేను 2018లో తోల్కట్ట గ్రామంలో భూమి కొనుగోలు చేశా. ఆ ప్రాపర్టీని నా మేనల్లుడు జ్ఞానదేవ్‌రెడ్డి చూసుకుంటున్నాడు. అందులో ఫార్మ్ హౌస్ లేదు. తోటలు, పనిచేసేవారికి రెండు గదులు మాత్రమే ఉన్నాయి. నా ప్రమేయం లేకుండా సదరు తోటను వర్రా రమేశ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి జ్ఞానదేవ్‌రెడ్డి కౌలుకు ఇచ్చినట్టు తెలిసింది. తన ఆధీనంలో ఉన్న ఆ తోటను రమేశ్‌కుమార్‌రెడ్డి, ఎం వెంకటపతిరాజుకు కౌలుకు ఇచ్చినట్టు తెలిసింది. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నిన్ననే పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాను' అని పేర్కొన్నారు. 'మీడియాలో వార్తలు వస్తున్నట్టు ఆ తోటలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగి ఉంటే వాటికి నాకు ఎటువంటి సంబంధం లేదు. ఆ రోజు నేను హైదరాబాద్‌లో లేను. రాజకీయంగా నన్ను ఇబ్బంది పెట్టడానికే కొందరు నాపై దుష్ప్రచారం మొదలుపెట్టారు' అని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



గురువారం జనగామ మండలం పెంబర్తిలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

జనగామ మండలం పెంబర్తిలోని మహమ్మాయి అమ్మవారి జాతరలో ఎమ్మెల్సీ కవిత చేతులకు ముత్తయిదువ గాజులు తొడుగుతున్న పూసలక్క

బీసీల కోసం 3 బిల్లులు పెట్టాలి

- విద్య, ఉద్యోగాల్లో 46% రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు.. స్థానిక ఎన్నికల్లో 42% వాటాతో మరొకటి పెట్టాల్సిందే
- బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి
- పింక్‌బుక్‌లో అన్నీ నోట్ చేస్తున్నాం
- జనగామ, భువనగిరిలో మీడియాతో ఎమ్మెల్సీ కవిత

> బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం.. బీసీ బిల్లు పెడుతామని ప్రకటించింది. ఇది బీసీలందరి విజయం. ఇది తొలి విజయం.
>
> - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జనగామ, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ)/జనగామ రూరల్/భువనగిరి కలెక్టరేట్: బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకొంటే కుదరదని, ఒకటి కాదు మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఆమె బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా కార్యాలయంలో, యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోనూ మీడియా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీసీ జనాభా 46% ఉంటే 42% రిజర్వేషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. విద్యలో 46% రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, ఉద్యోగాల్లో 46% రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లు, స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42% రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లును పెట్టాలని డిమాండ్ చేశారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లేలా అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నట్టు నిర్దిష్టమైన సమాచారం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ధోకేబాజ్ పార్టీ అని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటని మండిపడ్డారు. మళ్లీ కులగణన సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, అయితే 15 రోజులు కాకుండా నెల రోజులపాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమంది తమ ఉపకులం చెప్పలేదని అంటున్నారని, దానికి సంబంధించి ఏవిధంగా ఆలోచన చేస్తారో చెప్పాలని, హైదరాబాద్‌లో 60% మంది తమ ఇండ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసి, టోల్‌ఫ్రీ నంబరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టాలని జాగృతి పదేండ్ల ముందే డిమాండ్ చేసిందని గుర్తుచేశారు.

పింక్‌బుక్‌లో అన్నీ రాస్తున్నాం

'కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. పింక్‌బుక్‌లో అన్నీ రాసుకుంటున్నాం. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చెల్లిస్తాం. లెక్కలు ఎలా రాయాలో మాకూ తెలుసు. మీ లెక్కలు తీస్తాం' అని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని, పోస్టు చేసిన మరుసటిరోజే ఇంటికి పోలీసులు వచ్చి వేధిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తారనే రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అబద్ధాలను ప్రజల్లో ఎండగడుతామని స్పష్టంచేసిన కవిత.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం

కేసీఆర్ ప్రారంభించిన తెలంగాణ ఉద్యమానికి భయపడి 2001లో ఆగమేఘాలపై దేవాదుల ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాన చేసినా, ఉమ్మడి రాష్ట్రంలో ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదని, కేసీఆర్ హయాంలో పనులు పూర్తిచేసి గ్రామాలకు నీళ్లు పారించారని కవిత వివరించారు. బీఆర్ఎస్ హయాంలో 95% పూర్తయిన సమ్మక్క-సారక్క బరాజ్ పనుల్లో మిగిలిపోయిన 5% పనులను పూర్తి చేయలేని అసమర్థ, చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఇదే అంశంపై ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఆయా సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యామ మల్లేశం, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

> అవకాశవాదం కోసం పార్టీ మారిన కడియం శ్రీహరిని ప్రజలు క్షమించే ప్రసక్తే లేదు. ఉప ఎన్నిక వస్తే అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తుంది. న్యాయ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉన్నది. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్‌కు అనుకూలమైన తీర్పు వస్తుందన్న నమ్మకం ఉన్నది.
>
> - ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జయహో పూసలక్క!

జాతి సిగలో మెరుపులు సంచార బిడ్డలు.. జీవన మాధుర్యపు బంధువులు అని ఎమ్మెల్సీ కవిత అభివర్ణించారు. జనగామ జిల్లా పర్యటనకు గురువారం వెళ్లిన ఆమె గాజులగంప నెత్తికి ఎత్తుకొని పూసలక్క వేషధారణలో స్థానికులను అలరించారు. 'ప్రేమైక జీవన సారథులు.. సంప్రదాయ సౌందర్యపు ప్రతీకలు.. పూసలగంప పూల పుప్పొడి స్వచ్ఛతకు లోగిలి.. తెలంగాణ చేతివృత్తుల చేతనం.. ముత్తయిదు గాజుల మురిపెం..' అని ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. జనగామ జిల్లా పెంబర్తిలో పూసలోళ్ల అక్కాచెల్లెండ్లు తనకు అపురూపంగా గాజులు తొడిగారని తెలిపారు. జయహో పూసలక్క.. జయహో బీసీ అని నినదించారు.

దసరాకు జాకిట్ ముక్క కూడా ఇయ్యలె..

'గతంలో పాలన ఎట్లుండె.. ఇప్పుడెలా ఉన్నది. కేసీఆర్ హయాంలో పంటలు దండిగా పండాయి. చెరువులు, కుంటలు పొంగిపొర్లేది. కానీ, ఇప్పుడు నీళ్లు లేవు. కాలువలు పారిందిలేదు. కాలంలేదు.. పంటలు ఎండిపోతున్నాయి. దసరాకు రెండు చీరలు ఇస్తా అన్నరు. ఒక్క జాకిట్ కూడా ఇయ్యలె.. లగ్గం అయిన వాళ్లకు తులం బంగారు పెడతా అన్నడు. ఏదీ.. మొన్న మా మనువరాలికి లగ్గం అయ్యింది. తులం బంగారం రాలె. దొంగబస్సులు పెట్టిండు. మా పెంబర్తిలో ఒక్క బస్సు ఆగదు. ఆటోలే దిక్కు' అని జనగామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవితతో పెంబర్తి గ్రామానికి చెందిన ఇట్టబోయిన నర్సమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉన్నదో నర్సమ్మ మాటల్లోనే తెలుస్తున్నది.

రాజ్యాధికారం సాధించుకుందాం

- బీసీ సంక్షేమ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలోని బీసీ సమాజం జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి రాజ్యాధికారం సాధించుకుందామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం లక్డికాపూల్‌లోని హోటల్ అశోకలో బీసీ మేధావుల ఫోరం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కులగణన రీసర్వేకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం మాట్లాడుతూ.. రీసర్వేలో భాగంగా ఆన్‌లైన్, టోల్‌ఫ్రీ సౌకర్యాలతోపాటు ప్రతి ఇంటికి వెళ్లి నమోదు కాని వివరాలు సేకరించాలని సూచించారు.

సచివాలయంలో నకిలీ ఉద్యోగులను నివారించేదెలా?

- తలలు పట్టుకుంటున్న భద్రతా సిబ్బంది

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ):సచివాలయంలో నకిలీ ఉద్యోగులు వరుసగా పట్టుబడుతుండటంతో అధికారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. పట్టుబడుతున్నవారు ఐడీ కార్డులు సైతం తయారు చేసుకోవడంతో భద్రతపై అనుమానాలు కలుగుతున్నాయి. వేలాది మంది ఉద్యోగులు, సందర్శకులు వచ్చిపోయే చోట నకిలీ ఉద్యోగులను గుర్తించడం ఎలా? అనేది భద్రతా సిబ్బందికి సవాల్‌గా మారింది. రెండు వారాల కిందట నకిలీ జూనియర్ అసిస్టెంట్, గతవారం నకిలీ తహసీల్దార్ పట్టుబడగా, బుధవారం నకిలీ ఐఏఎస్ అధికారిని పట్టుకున్న సంగతి తెలిసిందే. ఉద్యోగులను నిర్ధారించుకునేందుకు ఐడీ కార్డు తప్ప తమకు మరో ప్రత్యామ్నాయం లేదని ఎస్పీఎఫ్ అధికారులు చెబుతున్నారు. పూర్తి వివరాలు వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తే నకిలీ ఉద్యోగులను గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

రీసర్వేకు అందరూ సహకరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- బీసీ సంఘాలు, మేధావులతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం ఈ నెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పిస్తున్నామని.. బీసీ సంఘాలు, మేధావులు సహకరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. బీసీ కుల సంఘాలు, మేధావులతో సచివాలయంలో గురువారం ఆయన భేటీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయాల్లో కౌంటర్ ఏర్పాటు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో కూడా సమాచారం సేకరిస్తామని వివరించారు. ప్రభుత్వం రీ సర్వేకు అంగీకరించడంపై కులసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్‌గౌడ్, ఈరవత్రి అనిల్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, వినయ్‌కుమార్, తాడురి శ్రీనివాస్, ప్రొఫెసర్లు మురళి మనోహర్, విశ్వేశ్వర్, తిరుమలి, దాసు సురేశ్, కుమారస్వామి, సంఘాల నేతలు పాల్గొన్నారు.

బీసీలు 7% తగ్గి.. ఓసీలు 7% పెరుగుతరా?

- కులగణన శాస్త్రీయంగా జరగలేదు
- బీసీలు 53 శాతమని 'శ్రీకృష్ణ కమిటీ' తేల్చింది
- ప్రభుత్వం 46 శాతం ఉన్నారని తేల్చడం ఏంటి?
- ఈశ్వరయ్య ముసాయిదాను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి
- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి
- నమస్తే తెలంగాణతో ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ తిరుమలి

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కులగణన శాస్త్రీయంగా జరగలేదని ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ తిరుమలి అభిప్రాయపడ్డారు. శ్రీకృష్ణ కమిటీ రాష్ట్రంలో బీసీలు 53 శాతం ఉన్నట్టు తేల్చిందని, కానీ ఈ సర్వేలో ఏడు శాతం తగ్గడమేమిటని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో అగ్రకులాలవారు ఏడు శాతం ఎలా పెరిగారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఉన్నా.. బీసీలకు 42 శాతం ఎలా కల్పించాలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ ఈశ్వరయ్య ఓ ముసాయిదాను రూపొందించి సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసినట్టు తెలిపారు. దానిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. కులగణన సర్వేలో లోపాలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై ఆయన గురువారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

నమస్తే తెలంగాణ: కులగణన సర్వేపై మీ అభిప్రాయమేంటి?

ప్రొఫెసర్ తిరుమలి: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కులగణన క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్‌గా నియమించడం సరికాదు. జనాభా లెక్కలు, కులగణన డాటాపై పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తిని ప్రభుత్వం నియమిస్తే సర్వే పారదర్శకంగా జరిగేది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో నియమించిన 'శ్రీ కృష్ణ కమిటీ'కి క్రెడిబులిటీ ఉంది. అలాంటి కమిటీని ప్రభుత్వం నియమించాల్సింది. ప్రభుత్వం కలెక్టర్లతో సర్వే చేయించింది. రాష్ట్రంలో సృష్టించిన ధనం ఎవరి చేతిలో ఉన్నదో సర్వే తేల్చాలని మేము మొదటి నుంచి డిమాండ్ చేశాం. అన్ని రంగాల్లో ఏ వర్గం వారు ఎంత అభివృద్ధి చెందారో లెక్క తేలాలి. కానీ ప్రభుత్వం మా డిమాండ్‌ను పెడచెవిన పెట్టింది.

నమస్తే తెలంగాణ: బీసీల సంఖ్య కావాలనే తగ్గించారనే వాదన వినిపిస్తున్నది. దీనిపై మీరేమంటారు?

తిరుమలి: భారతీయులు అంతా ఒకటే అనే భావన సర్వేలో కనిపించలేదు. ఆదాయంలో, అభివృద్ధిలో వాటా లేని వారు రాష్ట్రంలో అనేక మంది ఉన్నారు. అట్టడుగుస్థాయిలో ఉన్న వర్గాలకు సర్వేలో చోటు దక్కలేదు. శ్రీకృష్ణ కమిటీ తెలంగాణలో 53 శాతం మంది బీసీలు ఉన్నారని తేల్చింది. కానీ కులగణన సర్వేలో బీసీలు 7 శాతం తగ్గినట్టు ప్రభుత్వం తేల్చడం ఏంటి? 10 శాతం ఉన్న అగ్ర కులాలు వారు 17 శాతం ఎలా పెరిగారు? అనే విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

నమస్తే తెలంగాణ: ఉపకులాల వారీగా లెక్కలు చూపకపోవడాన్ని ఏమంటారు?

తిరుమలి: కులగణన సర్వేలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీల బతుకుచిత్రం బయటకు తీయలేదు. ముస్లింలను కలిపి బీసీల జనాభా 56 శాతం అనడం సరికాదు. ప్రభుత్వం డాటాను కరెక్షన్ చేసుకోవాలి. సంచార జాతుల వారికి స్థిర నివాసం లేదు. 6 నుంచి 7 సంచార జాతుల వారు కులాల జాబితాలోకి వచ్చారు. వారి లెక్కలు తేలాల్సి ఉంది. గత 14 ఏండ్లలో రాష్ట్రంలో ఏపీకి చెందిన అనేక మంది మైగ్రేట్ అయ్యారు. వారి పరిస్థితి ఏంటి? అగ్ర కులాలలో ఎవరి జనాభా ఎంత అన్నది కూడా సర్వేలో చూపలేదు. కులగణన లెక్కలు బయటపెట్టడంలో సర్కారు ఎందుకు జాప్యం చేస్తున్నదో సమాధానం చెప్పాలి. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపింది.

నమస్తే తెలంగాణ: ప్రభుత్వానికి మీరు చేసే డిమాండ్ ఏంటి?

తిరుమలి: బీసీలకు ఇచ్చిన హామీ మేరకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. కులగణన సర్వేలో లోటుపాట్లను సవరించుకుని సర్వేను మరింత శాస్త్రీయంగా చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలలోపే 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి. ఈశ్వరయ్య డ్రాఫ్ట్ యాక్ట్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని బీసీ రిజర్వేషన్లకు వెంటనే చట్టం చేయాలి. రిజర్వేషన్లు కల్పించే విషయంలో మేధావులు, విద్యావేత్తల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి.

ఎలక్షన్ ఎప్పుడైనా.. ప్రజల సెలెక్షన్ కేసీఆరే

- రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డిలిద్దరూ ఐరన్ లెగ్‌లే
- ఆరు హామీలపై ప్రశ్నిస్తారనే భయంతోనే రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జీరో ఖాయం
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల వీడియో క్లిప్పింగ్‌లను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖిలీల్‌వాడి, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వేలు, వాయిదాల పద్ధతి లేకుండా ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు జరగాల్సింది రీ సర్వే కాదని, రీపోలింగ్ అని స్పష్టం చేశారు. ఎలక్షన్ ఎప్పుడు జరిగినా ప్రజల సెలెక్షన్ కేసీఆరేనని, రేవంత్‌రెడ్డిని ఇంటికి సాగనంపడం ఖాయమని పేర్కొన్నారు. గురువారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలిద్దరూ ఐరన్ లెగ్‌లేనని, వారెక్కడ కాలు పెడితే అక్కడ కాంగ్రెస్ బుగ్గిపాలై బొగ్గుగా మారుతుందన్నారు. రాహుల్‌గాంధీకి రైఫిల్‌రెడ్డి బాగోతాలన్నీ తెలిసిపోయాయని, అందుకే రేవంత్ మొహం చూడడానికి కూడా ఆయన ఇష్టపడడం లేదన్నారు. 32సార్లు ఢిల్లీకి వెళ్లినా రేవంత్‌కు రాహుల్ అపాయింట్‌మెంట్ దొరకలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. కులగణన రిపోర్టు పట్టుకెళ్లినా రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ఆరు హామీలపై ప్రశ్నిస్తారనే భయంతోపాటు, రేవంత్ ముఖం చూడడం ఇష్టం లేకనే రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారని తెలిపారు. రాహుల్‌గాంధీ తీరును చూసి సీఎంను మార్చడానికే ఇదంతా అని కాంగ్రెస్‌లో గుసగుసలు మొదలైనట్టు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఎవరికి వారే గుంపులుగా విడిపోయి ఢిల్లీలో సీఎం పదవి కోసం పైరవీలు చేసుకుంటూ పాలనను గాలికొదిలేశారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రాష్ట్రానికి సుస్థిర పాలన అందిస్తే, రేవంత్ రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిగా చేస్తున్నారని విమర్శించారు. తలకింద పెట్టి తపస్సు చేసినా రేవంత్‌ను ఇక తెలంగాణ ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జీరో రావడం ఖాయమన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులను గ్రామ పొలిమేరల్లోకి రాకుండా తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా కారు రావాలి.. కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారని జీవన్‌రెడ్డి అన్నారు.

ఆర్థిక మంత్రీ.. అభివృద్ధి మరిచారా?

- రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్న నిర్మలా సీతారామన్
- విభజన హామీలన్నీ నెరవేర్చినట్టు చెప్పకొచ్చిన కేంద్ర మంత్రి
- పదేండ్ల అభివృద్ధి కనిపించలేదా? అంటూ నిర్మలపై విమర్శలు
- తెలంగాణ నంబర్ వన్‌గా ఎదిగిందంటూ గతంలో ప్రశంసలు
- ఎన్డీఏ హయంలో పదేండ్లలో 119 లక్షల కోట్ల అప్పులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రెవెన్యూ మిగులుతో ఉండేది. పదేండ్లలో అప్పుల్లో మునిగిపోయింది'.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు ఇవి. అంతే కాదు, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విభజన హామీలను నెరవేర్చిందని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, తెలంగాణవాదులు మండిపడుతున్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు గురివింద గింజను తలపిస్తున్నాయని మండిపడుతున్నారు. పదేండ్లలో తెలంగాణ చేసిన అప్పుల గురించి మాట్లాడిన నిర్మలా సీతారామన్.. అదే పదేండ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని ఎందుకు ప్రశంసించలేదని ప్రశ్నిస్తున్నారు. తలసరి ఆదాయం, జీఎస